క్లుప్తంగా

పాఠశాల శుభ్రంగా ఉండాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న రమాదేవి

గోవిందరావుపేట : పాఠశాల చాలా శుభ్రంగా ఉండాలని జీసీడీఓ (గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) రమాదేవి సూచించారు. మండల పరిధిలోని చల్వాయి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం స్పెషల్ ఆఫీసర్ వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో ఆమె తనిఖీ చేశారు. వంట గది, స్టోర్ రూమ్స్, తరగతి గదులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. పాఠశాల ప్రాంగణం మొత్తం మంచి వాతావరణంతో శుభ్రంగా ఉండాలని, విద్యార్థినులతో ఎప్పటికప్పుడూ మమేకమవుతూ వారి పరిస్థితులను పరిశీలించాలని సిబ్బందికి సూచనలు చేశారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సిబ్బంది

ములుగు రూరల్: చిన్నారుల ఎదుగుదలకు నులిపురుగుల నివారణ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయని సన్‌రైజర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ పెట్టెం రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థులకు రెండు విడతల్లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ జనార్దన్, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

గోవిందరావుపేట: హైదరాబాద్‌లో సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాకు సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులందరూ హాజరుకావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వేం యాకుబ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని చల్వాయి ప్రభుత్వ పాఠశాలలో మండల అధ్యక్షుడు కణతల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. తులసి రామ్, శ్రీరాములు, రాజమౌళి, వెంకటేశ్వర్లు, రాజేందర్ తదితర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

మల్హర్: ప్రమాదవశాత్తు ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని పెద్ద తాడిచర్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివారల ప్రకారం.. పెద్దతాడిచర్ల గ్రామానికి చెందిన శ్రీనాథ్ ఇంట్లోనే కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో కిరణషాపులో ప్రమాదవశాత్తు మంటలు వచ్చాయి. గమనించిన కుటుంబ సభ్యులు మంటలు ఆర్పే ప్రయతన్నం చేశారు. కాగా, షాపులోని కిరాణా సామగ్రి, బైక్, ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.8లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు శ్రీనాథ్ తెలిపారు. సమాచారం అందుకున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అక్కడికి చేరుకోని బుధవారం ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. రూ.5.28లక్షల నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రమాదం ఎలా జరిగిందనే కారణం ఇంకా తెలియలేదు. బాధితుడు శ్రీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొయ్యూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుంతలమయంగా రోడ్డు



గుంతలమయంగా మారిన ఎక్కెల రోడ్డు



అధ్వానంగా ఉన్న బూటారం రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
- పట్టించుకోని అధికారులు

ఏటూరునాగారం: ఐటీడీఏకు కూతవేటు దూరంలో ఉన్న రెండు గిరిజన గ్రామాలకు వెళ్లాలి అంటే అడుగు తీసి అడుగువేయలేని పరిస్థితి. మూడు గజాలో గుంత ఉండడంతో ఆ రోడ్డుమీదవెళితే కడుపులోని పేగులు బయటకు వస్తాయి అన్నట్లుగా రోడ్డు ఉంది. ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎక్కెల, బూటారం గ్రామాలకు సరైన రోడ్డు మార్గం లేక గిరిజనులు, గిరిజనేతరులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అనేక సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం లేక బురదరోడ్డు, గుంతల రోడ్డు వారికి శరణ్యంగా మారింది. 163 జాతీయ రహదారి నుంచి ఎక్కెల వరకు 2 కిలోమీటర్ల రోడ్డు నిర్మించడానికి గతంలో రూ.50 లక్షలు మంజూరు చేయగా కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో వాటిని రద్దు చేశారు. రోడ్డు సౌకర్యం లేక ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలు సాగించకపోవడంతో గ్రామస్తులు నడిచి, సైకిళ్ల మీద ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఆ రోడ్డు మార్గంలో 3 కల్వర్టులను కూడా నిర్మించాల్సి ఉంది. రోడ్డు, కల్వర్టులు నిర్మించి గ్రామాలకు సరైన రోడ్డు మార్గం నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్నికల బహిష్కరణ

రోడ్డు సౌకర్యం లేదని, ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని 2019లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో ఆ రెండు గ్రామాలు ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. ఓట్లు ఎవరు వేయలేదు. కానీ ఇప్పటికీ ఆ గ్రామాలతో పాటు మరో నాలుగు గిరిజన గ్రామాలు కూడా ఈ రోడ్డు కీలకం. ప్రత్యేక పంచాయతీ చేస్తే మా గ్రామాలను బాగు చేసుకుంటామని స్థానికులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కానీ పరిష్కారం కాలేదు.

రోడ్డు నిర్మించాలి



ఎక్కెలకు రోడ్డు మార్గం లేక నానా అవస్థలు పడుతున్నాం. విద్యార్థులు కళాశాలకు, పాఠశాలకు, రైతులు ఎరువు బస్తాలు తెచ్చుకోవాలన్న వాహనాలు రాకపోకలను సాగించే పరిస్థితి లేదు. విద్యార్థులు నడుచుకుంటూ పాఠశాలకు మూడు కిలోమీటర్లు పోవాల్సి వస్తోంది.

– యాలం రవితేజ, గ్రామస్తుడు

గ్రామానికి రోడ్డు సరిగా లేదు



స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అవుతున్నా ఇంత వరకు మా గ్రామానికి రోడ్డు సరిగా లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారిన రోడ్డు మాత్రం వేయడం లేదు. పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అనేక మార్లు సర్వేలు చేశారే తప్పా తట్టమట్టికూడా పోయలేదు.

– దుబ్బ బాబు, గ్రామస్తుడు

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



చిన్నబోయినపల్లిలో ఇసుక మేటలు వేసిన పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

- బీజేపీ మండల అధ్యక్షుడు చక్రవర్తి

ఏటూరునాగారం: వర్షాలకు మండలంలోని శివాపురం, గోగుపల్లి, చిన్నబోయినపల్లి గ్రామాల్లోని రైతుల వరినారు, పొలాలు కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నబోయినపల్లిలో ఇసుక మేటలు వేసిన పొలాలను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షాలకు శివాపురం, గోగుపల్లి వద్ద ఉన్న పొలాలపై నుంచి గోగుపల్లి, వట్టివాగు ప్రవహించడంతో వరి పొలం కొట్టుకుపోయిందన్నారు. ప్రతీ రైతుకు రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు పరిహారం ఇచ్చేంతవరకు రైతుల పక్షాన పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు ఎలుకపల్లి శ్రీను, గండెపల్లి సత్యం, ఎలేందర్, చంద్రారెడ్డి, రవి, లక్ష్మయ్య, అకిరానందం, నాగయ్య, భూపాల్, వెంకన్న పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ



108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న గోపాల్‌రావు

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని 108 వాహనాన్ని డీఎంహెచ్ఓ గోపాల్‌రావు బుధవారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాన్పు సమయం దగ్గరపడిన గర్భిణులను ప్రభుత్వ వైద్యశాలల వైద్యాధికారులతో సమన్వయం చేసుకుని సమీపంలోని ఆస్పత్రులకు తరలించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఫోన్ కాల్స్ స్పందించి క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ రాజ్ కుమార్, డీఈవో కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి స్థలం కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న పేరూరు గ్రామస్తులు

వాజేడు: మండల పరిధిలోని పేరూరు గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.25 లక్షలు నిధులు మంజూరయ్యాయని స్థలం లేకపోవడంతో నిర్మించడం లేదన్నారు. పేరూరు గ్రామం నిర్మించినప్పుడు బావి తీశారని అది గ్రామ పంచాయతీకి చెందిన స్థలం కావడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది పూడ్చి వేసినట్లు తెలిపారు. ఆ స్థలంలో గ్రామ పంచాయతీ నూతన భవనం నిర్మించడానికి అనుమతి ఇప్పించాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అట్టం రఘుపతి, గొడ్డె సత్యం, కుర్సం సాయిబాబు, గోట లాలయ్య, కుర్సం కృష మూర్తి, తొర్రెం లక్ష్మీనారాయణ ఉన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న రవిచందర్

ములుగు రూరల్: మల్లంపల్లి వద్ద బ్రిడ్జి తాత్కాలిక పనులను బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ పరిశీలించారు. ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడి బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాగా ఈ రోజు సాయంత్రం నుంచి బ్రిడ్జి పైనుంచి అన్ని రకాల వాహనాలు తిరిగేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి, అభినయ్ చారి, ప్రభు పాల్గొన్నారు.

కుసుమ జగదీశ్ జయంతి వేడుకలు



ఏటూరునాగారం: నాగజ్యోతికి కేక్ తినిపిస్తున్న నాయకులు



ములుగు రూరల్: జగదీశ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

ములుగు రూరల్: మల్లంపల్లి మండల కేంద్రంలో బుధవారం దివంగత మాజీ జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ జయంతిని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సీట్లు పంచి పెట్టారు. నాయకులు పాఎపు శ్రీనివాస్, కుసుమ సులోచన, ఆదినారాయణ, శ్రీధర్, సంతోష్, ప్రభాకర్, చంద్రకుమార్, రాజు హరినాథ్ తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారం : మండలంలోని బస్టాండ్ ఆవరణలో దివంగత మాజీ జెడ్పీ చైర్మన్ జగదీష్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, ఖాజాపాషా, నూతి కృష్ణమూర్తి, సమ్మయ్య, మల్లారెడ్డి, అశోక్‌గౌడ్, రాంనర్సయ్య, శ్రీనివాస్, నాగరాజు, రామ్మూర్తి, చంద్రబాబు పాల్గొన్నారు.

24న వేదిక బహిరంగ సభ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ములుగు రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సంఘీబావ వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న వేదిక బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులు రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ ప్రజలపై వారి హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. ఆదివాసీల హక్కుల సాధనకు నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ్ సింగ్, వెంగలరెడ్డి, భిక్షపతి, భద్రయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన వరద.. నిలిచిన రాకపోకలు



బోదాపురం వద్ద బ్రిడ్జి పైకి చేరిన వరద నీరు

వెంకటాపురం(కె): కురుస్తున్న వర్షాలకు మండలంలో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. దినికి తోడు మండలంలో క్రమక్రమంగా గోదావరి వరద పెరుగుతుంది. కాగా మంగపేట రోడ్డులోని గోదావరి పాయకు గోదావరి వరద చేరడంతో లంకల్లోకి రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని జిన్నెలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లోతట్టు గిరిజన గ్రామలకు రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా బోదాపురం గ్రామ సమీపంలోని జిన్నెల వాగు బ్రిడ్జి పైకి గోదావరి వరద నీరు చేరడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వెంకటాపురం మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి.



కమలాపురం ఇంటెక్‌వెల్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



మంగపేట: పునరావాస కేంద్రానికి తరలించేందుకు ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు



వాజేడు: కృష్ణాపురం వద్ద నీట మునిగిన పొలాలు

వరద ఉధృతి పరిశీలన



రామన్నగూడెం వద్ద గోదావరిని పర్యవేక్షిస్తున్న అధికారులు



పునరావాసం కేంద్రంలోని బాధితులకు అన్నం వడ్డిస్తున్న కార్యదర్శి రమాదేవి

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం వద్ద మండల ప్రత్యేకాధికారి, జిల్లా సివిల్ సప్లయీస్ డీఎం రాంపతి, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కుమార్ నది ఉధృతిని పరిశీలించారు. బుధవారం సాయంత్రం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద వరద పెరుగుదలను పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. అనంతరం ఓడవాడ, పద్మశాలి వాడ సమీపంలోని ప్రజలను వరద ఎక్కువైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వాహనాలను సైతం సిద్ధం చేసి పెడుతామని తెలిపారు. వరద వస్తే తామే సమాచారం ఇస్తామని అధికారులకు ప్రజలు హామీ ఇవ్వడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘు, ఎల్లయ్య, దేవేందర్, అరుణతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

గిరిజన భవన్‌లో పునరావాసం

మండలంలోని క్రాస్‌రోడ్డులో గల గిరిజన భవన్‌కు తరలించిన ముంపు బాధితులకు బుధవారం ఉదయం టిఫిన్, భోజన సదుపాయాన్ని గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏ ర్పాట్లు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రమాదేవి తెలిపారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



ములుగు రూరల్: రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో నాయకులు



మంగపేటలో..

దేశానికి దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అయన చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



వాజేడు: రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వెంకటాపురం(కె)లో..



ఏటూరునాగారంలో..

తప్పనిసరిగా దోమతెరలు వాడాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి జ్యోతి



మంగపేటలో..

వెంకటాపురం(కె): గ్రామాల్లో ప్రజలు తప్పనిసరిగా దోమ తెరలను వాడాలని వైద్య సిబ్బంది సూచించారు. మండల పరిధిలోని ఎదిర, చొక్కాల, వీరభద్రవరం, వెంకటాపురం, మరికాల గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పరీక్షలు చేసి మందులను అందజేశారు. గ్రామంలో ఎవరికైనా జ్వరం వస్తే ప్రభుత్వ వైద్యశాలకు రావాలని తెలిపారు. వైద్యాధికారులు జ్యోతి, పవన్, ఆశీష్, భాస్కర్, డీపీఎంఓ సత్యనారాయణ, హెచ్ఈఓ కోటిరెడ్డి, పీహెచ్ఎన్ యాకమ్మ ఉన్నారు.

మంగపేట: వర్షకాలంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని వైద్యాధికారి యమున తెలిపారు. మండలంలోని కొత్తమల్లూరులో చుంచుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యమున మాట్లాడుతూ.. ప్రజలు వర్షాకాలం ముగిసే వరకు ఆరోగ్య జాగ్రత్తలు తప్పక పాటించాలని సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా జనావాసాల పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వి పద్మ, ఏఎన్ఎం, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

నిషేధిత గడ్డిమందు పట్టివేత



నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద ఎస్సై పవన్‌కుమార్ బుధవారం పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద నిషేధిత గడ్డి మందు (గ్లైసిల్) లభించింది. అనుమానాస్పదంగా కనిపించిన అతని వద్ద ఉన్న ఒక సంచిని తనిఖీ చేయగా 15 బాటిల్‌ల గడ్డి నిషేధిత గడ్డి మందును లభించిదని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ గడ్డి మందును మహారాష్ట్రలో కొనుగోలు మహాముత్తారం మండలానికి తీసుకువెళ్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.